"ఆమె సొమ్ముతో ఆమెను పోషించే దౌర్భాగ్యపు ఆలోచన యీ మగాడికెందుకు? ఆడదాన్ని వంచించి డబ్బు గుంజడానికి యిన్ని మాయాజాలాలా? ఇన్ని దొంగ నాటకాలా?"

# ఇది కథ కాదు

పి. నాగేశ్వరరావు

కంచికి చేరిందే కథైతే– ఇది కథకాదు.

* * * * *


ప్రపంచానికి చీకటి ముసుగులు తొడిగి చాలా సేపైంది. పగటివేళ సూర్యుడుతో లే రథానికి గుర్రాల్లా పరుగెత్తిన మనుషులు అలిసి, సొలసి సుషుప్తిలో పడిపోయారు. నిద్రాదేవి కౌగిలిలో ఒదిగిపోయారు.

శారదకి మాత్రం నిద్రాదేవి తన ఒడిలో చోటివ్వనని వెలివేసి దూరంగా పారిపోయింది. తను పడుకొన్న చాప ముళ్ళపాన్పులాగాను, తనున్న నాలుగ్గో డలు తీహారు జైలులాగాను అనిపించ సాగిందామెకు. ఉదయంనుంచి పచ్చి గంగ కూడా ఎరగని ఆమె కడుపును ఆకలి కర కర కోసేస్తోంది. భర్త కొట్టిన దెబ్బలకి పచ్చి పుండుగా మారిన ఆమె శరీరం చలి గాలికి సలుపుతోంది. చిట్లిన పెదవినుంచి అప్పుడప్పుడు వెచ్చని రక్తం నాలుకకు తగులుతోంది ఉప్పగా ...

కిటికీలోంచి బయటికి చూసింది. అభాగ్యుడి కళ్ళల్లా మినుకు మినుకు మంటు న్నాయి చుక్కలు. కొబ్బరిచెట్టు నిస్సహా యంగా పెరట్లోంచి చూస్తోంది. తడారిన గొంతును తడుపుకోవాలన్న ఆలోచన వచ్చింది ఆమెకు. కాని మనసుతో శరీరం సహకరించటంలేదు. ఆమె మనస్సు దెబ్బ తింటే, దేహం ఘోరంగా దెబ్బతిని ఉంది.

శారద నాలుగ్గజాల దూరంలో ఉన్న మంచంకేసి చూసింది. బెడ్‌లైటు వెలుగులో భర్త నాగరాజు నిద్రపోతున్నాడు. తాను అడవిలో వున్నట్టు తన చెంతి







మరో ప్రాణి లేనట్టు, తనకే చీకు, చింతా లేనట్టు గుర్రుపెట్టి నిద్ర పోతున్నాడు అతను తన భర్త. తనని భరించేవాడు, ధర్మార్థ కామమోక్షాల్లో తనతో సహక రించి. తన జీవితానికి రక్షణ కలిగిస్తానని అగ్నిసాక్షిగా ప్రమాణం చేసి పదిమంది ముందు తన మెడలో పసుపు తాళికట్టి, తనపై అధికారం సంపాదించుకొన్న భర్త. తనని చావు దెబ్బలు కొట్టి, చిత్ర హింసలు పెట్టి, ఏమీ ఎరగనివాడిలా నిద్ర పోతున్నాడు. అతనే కాదు– ఆ ఇంటిలో ఎవరికీ తనని గురించి ఆలోచన లేదు. తనేమైపోయినా వారికి పట్టదు. తను తిన్నా తినకపోయినా, నవ్వినా, ఏడ్చినా వాళ్ళు పట్టించుకోరు.... తనని ఏడ్పించటం వాళ్ళ విధి....తను ఏడ్చి వాళ్ళని సంతోష పెట్టటం తన ధర్మం....

తనకికన్న వాళ్ళే తనపక్క నఉంటే...!

శారదకి ఒక్కసారిగా అమ్మ, నాన్న గుర్తుకువచ్చి కళ్ళంట సుడులుగా నీళ్ళు తిరిగాయి.... ఆమె గుండె చెరువై కళ్ళ గట్టులు తెంచుకుని వరదిగా పొంగి వస్తున్నాయి

ఆ ఇంటికి తను కోడలిగా వచ్చినదగ్గరి నుంచి తనకు లభించిన సుఖం, శాంతి, భాగ్యం, భోగం అన్నీ అవే ... తను పిలిచినప్పుడు పలికేవి.... తనని ఊరడిం చేవి కూడా అవే....

* * *

నెల రోజులకు ముందు—

శారదకి నాగరాజుతో పెళ్ళయింది. శారద నాగరాజుకు భార్య అయింది.

అంతకుముందు నలుగురైదుగురు శారదని చూశారు. కొందరికి శారద నచ్చలేదు. కొందరికి శారద నాన్న ఇచ్చే కట్నం నచ్చలేదు.

నాగరాజుకు శారద నచ్చింది. నాగరాజు తండ్రి రామారావు ప్రకాశం ఇస్తానన్న కట్నానికి ఒప్పుకున్నాడు. అందువల్ల శారద, ప్రకాశం ఇద్దరూ సంతోషించారు. శారద కన్నెమనసు ఊహల ఉయ్యాలలో ఊగిపోయింది.

ప్రకాశం ఒక ప్రైవేటు కంపెనీలో నెలకు ఐదొందలు తెచ్చుకొనే చిరుద్యోగి. మధ్యస్థమైన సంపాదనకు తగ్గట్టు, గుట్టు చప్పుడు కాకుండా ఇంతవరకు సంసారాన్ని లాక్కొచ్చాడు. సంసార నౌకకు చుక్కాని లాంటిది భార్య. రాధమ్మ అలా చుక్కానిలా ఆ సంసార నౌకను జాగ్రత్తగా మళ్ళిస్తోంది.

ప్రకాశానికి శారద ఒక్కతే ఆడపిల్ల. ఇంటర్ వరకు చదివింది.. పై చదువులకు పంపే స్తోమతలేక కూతురి చదువుకు ఫుల్‌స్టాప్ పడింది.... అప్పటికీ ప్రకాశం ఆలోచించాడు.... శారదని కనీసం గ్రాడ్యుయేషన్ వరకైనా చదివించి, ఏదో ఒక ఉద్యోగం సంపాదించి పెట్టగలిగితే- శారద పెళ్ళి తనకి పెద్దసమస్య కాబోదు. ఉద్యోగాలు చేసే ఆడపిల్లలకి కట్నాలు లేకుండానే పెళ్ళిళ్ళవుతున్నాయి కాని తనసంపాదనతో శారదని చదివించటం కష్టం.... డిగ్రీలో చేరాలంటే టౌనుకి పోవాలి........ హాస్టలు.... ఫీజులు.... తలకి మించిన భారం.... ఒక వేళ ఇన్ని తలనొప్పులు పడి చదివించినా.... ఉద్యోగం దొరకటం సామాన్యమైన పనికాదు... అన్ని నిత్యావసర సరుకుల్లాగే అవికూడా ఖరీదును పెంచుకొంటున్నాయి.... రాను రాను ఉద్యోగమన్నది ఒక అపురూపమైన, అరుదైన వస్తువులా తయారౌతుందేమో..


శారదకి మంచి సంబంధం చూడాలని ప్రకాశం ఆలోచన.... ఉద్యోగం చేసేవాడైతే శారద సుఖపడిపోతుంద సంబంధాల కోసం ప్రయత్నాలు సాగించాడు

ఇలాంటి సమయంలో నాగరాజు సంబంధం వచ్చింది నాగరాజు హైదరాబాదులో మెకానిక్‌గా పనిచేస్తూ నెలకి ఆరొందలు సంపాదిస్తున్నాడని తెలిసింది. ఫరవాలేదనుకున్నాడు ప్రకాశం. తరువాత నాగరాజువాళ్ళు శారదని చూడటం, నచ్చటం అన్నీ జరిగిపోయినె.

రామారావు పదివేలదాకా కట్నం అడిగాడు ప్రకాశం ఆరువేలకి మించి యివ్వలేనన్నాడు. కూడికలు, తీసివేతలు జరిగాయి

"ఈ రోజుల్లో మగపుటక పుడితే చాలు



బోల్డంత కట్నం. కానుకలు యిస్తామని వస్తున్నారు. బొత్తిగా ఆరువేలంటే చెప్పుకోవటానికైనా తీసికట్టగా వుంటుంది" అంటూ నసిగాడు. రామారావు సవరింపులు జరిగాయి చివరికి ఆరువేలే ఖాయమైంది.

నిజానికి ఆరువేలుకూడా యిచ్చుకునే స్థితిలోలేడు ప్రకాశం కాని తన బిడ్డ సుఖపడాలి పిల్ల పాపలతో కళకళలాడాలి. కట్నం యివ్వకుండా తను శారదకి పెళ్ళి చెయ్యలేడు ఈ రోజుల్లో అంత ఔదార్యం చూపేవాళ్ళు వున్నారో, లేరో తనకి తెలీదు. కనీసం యింతకంటే తక్కువ యిచ్చి మంచి సంబంధంకూడా తేలేడు.

తాతలనాటి ఆస్తి అయిన స్థలం అమ్మేశాడు. పెళ్ళి ఖర్చులకోసం ఆఫీసులో కొంత అప్పు తీసుకొన్నాడు. పెళ్ళికూడా బాగానే చేశాడు. కొండంతభారం గుండెల మీదినుంచి దిగిపోయినట్టు తృప్తిగా నిశ్వసించాడు

రెక్కలొచ్చి చుక్కలకు చుట్టాలై ఆకాశాని కెగిరిపోతున్న ధరలతో సతమతమైపోతూ, ఆశల గుర్రాలకు కళ్ళాలువేసి.

## మాయకోవస్కీ

అతను
భయపడిన చాపపిల్ల
ఒకే ఒక్క రెక్కతో పుట్టిన పక్షిపిల్ల.
మేఘాలకి లాగూలు తొడుగుతాడు.
వదంతుల మృత్యు శయ్యమీద కొరిగి
ఆత్మహత్య చేసుకుంటాడు.
మంచు కొండలమీద నెత్తుటి గులాబీ.
మానవస్మృతిమీద మాయని గాయం.
చిట్లుతున్న కన్నీళ్ళ బొట్లల్లోంచి
పెట్లుతున్న నవ్వుల నరాల్లోంచి
అడుగుతూంటాడు
ఈ ఉదయం ఏ శతాబ్దమని
ఈ ఉదయం ఏ మానవ మహోదయమని.
అందాకా
ఓ గుప్పెడు ఇసుకతో తోముకుంటాడు పళ్ళు.
గొంతుమీద
ఏడ్చేవాడి గొంతుమీద నుంచోని కాలుబెట్టి నొక్కితే
ఆనందం విచ్చుకుంటుంది.
గేయం కొలనులో స్నాన మాడుతుంది కలువలా.

—'మో'

కోరికలకు సంకెళ్ళువేసి గొర్రెతోకంతటి సంపాదనతో. బ్రతుకీడుస్తున్న ఒకమధ్య తరగతి గృహస్థుకు ఇంతకంటే మించిన పరమార్థం కనిపించదేమో!

శారదని అత్తవారింటికి పంపేటప్పుడు అప్రయత్నంగానే కళ్ళనీళ్ళు తిరిగాయి ప్రకాశానికి .. రాధమ్మకూడా బాగా దుర పిల్లింది. శారదని అపురూపంగా పెంచారు. కాని మకురుగా తయారు కాలేదు.... ప్రకాశం కూతురు 'నిప్పు' అని పేరు తెచ్చుకుంది. తెలివైన పిల్లనిపించుకొంది.

అత్తవారింటికి చేరింది శారద.... కాని ఒంటిగా చేరలేదు భావి జీవితాన్ని గురించిన ఎన్నో ఆలోచనలు మధురోహ లను తనకి తోడుగా తెచ్చుకొంది. తన సంసారం సాఫీగా సాగిపోవాలి. రత్నాల్లాంటి అందమైన పిల్లలు పుట్టాలి. వాళ్లి పెద్ద చదువులు చదివి.... మంచి ఉద్యోగాల్లో స్థిరపడిపోవాలి.. తను సుఖపడాలి

ఇలాంటి స్త్రీ సహజమైన వర్కిట్టు ఆలోచనలకు ఆమె దూరం కాలేదు.... మినహాయింపు కూడా కాదు.

ఈ కాలమే చిత్రమైంది. ఎంత పెద్ద చదువులు చదివి, పదవులు చేపట్టినా, స్త్రీలందరూ పెళ్ళి విషయంలో ఒకే విధంగా ఆలోచిస్తారు పెళ్ళి, సంసారం, పిల్లలు.. ఈ బంధనాలను స్త్రీ తెంచుకోలేదు .... ఈ సంకెళ్ళు వదిలించుకోనూ లేదు కొందరికవి బంగారు సంకెళ్ళయితే మరికొందరికి ఉక్కు ఉరితాళ్ళు సంసారం కొందరి పాలిటి బృందావనమైతే యింకొందరి పాలిటి కారడవి. నిస్సారమైన ఎడారి

* * *

రామారావు సంసారం చిత్రమైనది ఆ యింటిలోని ఒక్కొక్కరు ఒక్కొక్క ధృవం! మనుషులమధ్య సంబంధాలు బహుతక్కువ. అత్తగారైన కామాక్షమ్మ నోటి దురుసు మనిషి. నిద్రపోయేటప్పుడు తప్ప మిగతా సమయమంతా యెవరితోనో వొకరితో ఏదో ఒకటి మాట్లాడుతూనో. లేదా పోట్లాడుతూనో వుంటుంది. కొండ శిఖరం మీద నుంచి అగాధంలోకి దూకే జలపాతం లాంటిది ఆమె నోరు. సినిమాలు, నగలు, చీరల సమాచారాలు పెళ్ళిళ్ళు, పురుళ్ళు, లేచిపోవటాలు ... ఊళ్ళోని సమస్త విషయాలకు ప్రసార కేంద్రం కామాక్షమ్మ

శారద తన తల్లికీ, అత్తగారికీ మధ్య వ్యత్యాసాన్ని బేరీజు వేసుకొంది 'కాయలున్న చెట్టులా నిండుగా, నిండుకుండలా గుట్టుగా వుంటుంది తన తల్లి. చిన్న విషయానికే ఎండిన తాటాకులా గలగలమంటుంది అత్తయ్య. ఆమె మాటలకు ఎదురు చెబితే ఇల్లు పీకి పందిరేస్తుంది.

ఆడపడుచు వసుంధరది తల్లిపోలిక కాదు అవసరమైతే పలుకుతుంది. పనుంటే చేస్తుంది. లేకపోతే ఏ నవలో వారపత్రికో ముందేసుకుకూర్చుంటుంది. పుస్తకం పూర్తికానిదే సమాధినుంచి ఈ లోకంలోకి రాదు. కథలెంత ముఖ్యమో ప్రకటనలు కూడా అంతే ముఖ్యం

"మరిది శేఖర్ తనకంటె పెద్దవాడు. కాని తను అన్నభార్య.... వదిన తాటి చెటంత మనిషి తనను 'వదినా' అని పిలుస్తుంటే తనకి ఎంత సిగ్గో " శారద పెదాలమీద చిరునవ్వొకటి లీలగా మెరిసింది

"దేన్ని తల్చుకొని జానీ ... అలా నవ్వుకొంటున్నావ్ నీలో నువ్వే" తన కుడిచేతిని ఆమె భుజమ్మీదవేసి, తన వైపుకు తిప్పుకొంటూ— నాగరాజు

శారద మెల్లగా తలెత్తి అతని ముఖంలోకి చూసింది. అతను నవ్వుతున్నాడు..

నవ్వు నవ్వులా అనిపించలేదు శారదకు. కాగితం పువ్వులా అసహజంగా వుంది కిళ్ళీ నములుతున్న నోరు నెత్తురు తాగినట్టు ఎర్రగా వుంది. పెదాలు నెత్తురోడుతున్న చురకత్తుల్లా వున్నాయి కళ్ళు ఉప్పిముద్దల్లా ఎర్రగా ఉన్నాయి

శారద మౌనంగా తల దించుకొంది

"అబ్బో.... అమ్మాయికి సిగ్గా పైగా. సిగ్గంతా పెళ్ళి పందిట్లోనే వదిలెయ్యాలి జానీ. ఇది ఏకాంత మందిరం. ఇక్కడ నువ్వు. నేను తప్ప గాలి కూడా వుండకూడదు గాలి మహా చిలిపిది మనం ఏమి గుసగుస లాడినా కడుపుబ్బరంతో అందరికీ చెప్పేస్తుంద" నాగరాజు నవ్వుతూనే అన్నాడు. అన్నతరువాత కూడా నవ్వుతూనే వున్నాడు. నవ్వుతూనే మళ్ళీ అన్నాడు

"పెళ్ళిచూపుల్లోనే నువ్వు నన్ను వెర్రిలో పడేశావు జానీ. నిన్ను యెలా

గైనా వదలకూడదనుకున్నాను. ఈ చుక్క నా చేతిలో చిక్కింది" శారద బుగ్గమీద చిటికేశాడు.

శారద మాట్లాడలేకపోతోంది. ఆమెకు ఆ వాతావరణం కొత్తగా, భయంగా, అయోమయంగా వుంది. కాలం స్తంభించినట్టు, గాలి ఆత్మహత్య చేసుకొన్నట్టుగా వుంది. నాగరాజు మాటల ఆధారంగా మనసును అంచనావెయ్యటానికి ప్రయత్నిస్తోంది. అతని మాటల్లో మార్దవం లేదు. మనసు కూడా అంతే అయితే....

"మౌనమే నీ భాష.... ఓ మూగ మగువా" నాగరాజు గదిలో లైటు తీశాడు.

స్త్రీ మనసుతో ఆలోచిస్తుంది.... మగవాడు మాటలతోనే ఆలోచనలను సాగించాలని చూస్తాడు.

* * *

శారద కాపురానికొచ్చి వారం దాటింది ఆ ఇల్లు ఒక జూ లాంటిదని ఆమెకు అర్థమైంది. ఆ ఇంటిలో ఎలా మసులుకోవాలి? వాళ్ళని ఎలా అర్థం చేసుకోవాలి? - మెట్టినింటి వాతావరణం ఆమెకు ఎగుడు దిగుడుగా వుంది.

మామగారైన రామారావు ఎక్కువగా మాట్లాడడు ఇంట్లో వున్నంత సేపు పడక కుర్చీలో వాలి తనలో తనే ఏవేవో గుణించుకొంటూ భాగించుకొంటూగడుపుతాడు రాత్రిళ్ళు ఎప్పుడోగాని ఇంట్లో వుండడు. ఆయనకు పేకాటపిచ్చని, రోజూ రాత్రిళ్ళు నివాసం క్లబ్బుల్లోనేనని శారదకి తెలిసింది.

చీట్లాటలో గెల్చుకొస్తే ఆ రోజు ఇంట్లో కోడి తెగేది.... పోగొట్టుకొస్తే కామాక్షమ్మ శివతాండవంచేసి, రామారావు పూర్వీకుల పుట్టు పూర్వోత్తరాల దగ్గర్నుంచి కడిగిపారేసేది. రామారావు భార్య నోటిని మూసే ప్రయత్నమేదీ చెయ్యడు. పైగా తనని కాదన్నంత నిర్లక్ష్యంగా ఉంటాడు

నాగరాజు పగలు ఇంట్లోనే ఉండడు. ఎక్కడికి వెళ్తాడో ఎవరికీ తెలీదు,ఎవరూ అడగరు. తల్లికి అతనంటే బంగారు కొండ.

రామారావు ఒకప్పుడు గవర్నమెంటు ఉద్యోగం చేశాడు. ఆ స్తిపాస్తులు అంతగా లేవు ఆశలు మాత్రం మెండు. కామాక్షమ్మ హైక్లాసు మనిషిలా దర్జా వెలగబెట్టాలని పట్టుబట్టింది ఆమె మాటల్ని తోసిరాజనే తెగువ రామారావుకు లేదు. అందినంతవరకు ఆరగింపులు సాగించాడు. పైసలకోసం అడ్డమైన పనులన్నీ చేశాడు. డబ్బు వస్తుందనుకున్న ప్రతి పార్టీకి పనులు చేసి పెట్టి బాగానే సంపాదించాడు. పెద్ద కూతుళ్ళిద్దరికీ కట్నాలు బాగా ముట్టజెప్పి ఘనంగా పెళ్ళిళ్ళు చేశాడు. భారత పౌరుడు గనక, ధర్మరాజు తమ్ముడనిపించుకోవటానికి జూదంలోకి పాదం మోపాడు చీట్లాట. రేసుల్ని. ఓ సంస్థానాధీశుడిలా వెలిగించాలనుకొన్నాడు.

ఏమిచేసినా భార్య చేతిలో మాత్రం కీలుబొమ్మే. తోలికి లెక్క చేసేది కాదు భార్య కారణంగా ఆయనకు యింటిలో పట్టు తప్పింది. విలువ రూపాయి విలువలా పడిపోయింది. పెద్ద కొడుకు నాగరాజు తల్లి గారాబంలో బాగా చెడిపోయాడు. చదువును మూటకట్టి అటకమీద పారేశాడు. చచ్చి చెడి యింటరు దాకా దేకాడు.

కామాక్షమ్మ మహారాణిలా చెలాయించింది కొంతకాలం ఇంట్లో నౌకర్లు. ఫ్రిజ్, మంచి ఫర్నిచర్, కారు కూడా కొనాలన్న ఆలోచనల్లో పడిపోయింది.

ఎమర్జన్సీ సమయంలో రామారావు ఉద్యోగం వూడిపోయింది. జూదంల్లోను, కేసుల్లోను సంపాదించిందంతా ఇగిరిపోయింది. మనిషి రోడ్డున. కుటుంబం అప్పుల్లో పడ్డారు పెద్దలిచ్చిన ఇల్లు తనఖాకి పోయింది. వట్టి మాటల మనుషులు మాత్రం మిగిలారు.

అప్పటి నుంచి కామాక్షమ్మ జరుగుతున్న దానిని విడిచిపెట్టి. కరిగిన కలలాంటి గతాన్ని నెమరువేసుకోవటంలోనే ఆనందం పొందసాగింది 'ఆరోజుల్లో: ఆ నగలు ...ఆదర్జా....' ఇవే ఆమె ఆలోచనలు. వర్తమానమే పట్టని ఆమెకు భవిష్యత్తు మీద చూపేముంటుంది?


రామారావుకు తన అదృష్టం మీద ఇంకా నమ్మకం చావలేదు కదిలిపోయిన సిరిని పాదాల చెంతకు తెచ్చుకోవటానికి ఆయనకు లాటరీలు ఉత్తమమైన మార్గాలుగా కనిపించాయి.... అన్ని స్టేట్ల లాటరీలు ఆయనచేత పోషింపబడుతున్నాయి.. ఎప్పుడో ఒకప్పుడు తనకి బంపర్ తగిలి తీరుతుందని ఎదురు చూస్తున్నాడు.

ఆ రోజే భాగ్యలక్ష్మి లాటరీ డ్రా ఫలితాలు.... రామారావు టిక్కెట్టు చేతిలో వుంచుకొని దీక్షగా పేపరులోకి చూస్తున్నాడు....కామాక్షమ్మ రామారావు ముఖంలోని ఫీలింగ్స్‌ని పరిశీలిస్తోంది....

ఒకటి.... రెండు.... మూడు.... నాలుగు.... ఐదు.... ఐదు అంకెలు కలిశాయి ఆఖరి అంకెకూడా కలిస్తే తన టిక్కెట్టుకు బంపర్ బహుమతి ఐదు లక్షలు రామారావు ముఖం ఒక్కక్షణం వెలిగి కరెంటుపోయినట్టు మాడిపోయింది. ఆఖరి అంకె తప్పింది. "అదృష్ట దేవత చిటికెలో తప్పించుకుపోయింది." విలవిల్లాడిపోయాడు రామారావు.

కామాక్షమ్మకి కూడా ఆశాభంగమయింది. లాటరీ నిజంగా తగిలి, డబ్బు పోయినట్టు ముఖంపెట్టి "బిడ్డొచ్చిన వేళ, గొడ్డొచ్చిన వేళ అన్నారు" అన్నది రుసరుస శారదని చూస్తూ. రామారావు కూడా శారదకేసి గుర్రుగా చూశాడు.

శారద మనసు కలుక్కుమంది. "వాళ్ళ మాటలు తనను ఉద్దేశించేనన్నది స్పష్టం.... కాని లాటరీ తగలకపోవటానికి తను కారణమా? ఇదెక్కడి న్యాయం.... తను దురదృష్టవంతురాలైనందువల్లనే లాటరీ తగల్లేదా? మరి వాళ్ళ అదృష్టంఏమైంది? తనుకంట్లో దూలాలుంచుకొని. ఎదుటివారి



## మల్లెపందిరి

### లాభాలెలా వస్తాయి?

దేశా ద్దేశాంతరం నీతం కాలాత్కాలాంతరం తథా।
వస్తుమూల్య విభేదేన వణిజో లాభ మర్జయేత్॥

వర్తకుడు దొరికేచోట వస్తువుని కొని దొరకని చోటుకి తీసుకుపోయి, దొరికే రోజుల్లో కొని దొరకని రోజులవరకూ కాపాడి, కొన్న ధరకంటె అమ్మే ధరను మార్చి లాభం సంపాదిస్తాడు. వర్తక రహస్యం ఇంత సింపుల్.

—సౌభరి

కంట్లో నలుసుల్ని ఎత్తి చూపటమంటే ఇదేనేమో.... తను ఆ ఇంటి కోడలే.... అందువల్ల తన వెనకనే అదృష్టాన్ని మోసుకురావాలా?"

ఆలోచించేకొద్దీ ఆ వ్యక్తులు చాల ప్రమాదకారుల్లా అనిపించసాగారు శారదకి ఎదుటివాళ్ళమీద ఎంతటి నిందనైనా మోపగల సమర్థులు. తను జీవితాంతం ఆ మనుషులతో కలిసి మెలిసి వాళ్ళ మధ్య బ్రతకాలి. ఇది తలుచుకొంటేనే శారదకి భయమేస్తోంది.

రోజులు గడుస్తున్నాయి. ఇంటిలో అందరికీ వండివార్చటం, కావలసినవి అందించటం తప్ప శారదకి మరో పరమార్థం కనిపించటంలేదు. భర్త ఆఫీసుకు పోతున్నట్లు, ఉద్యోగం చేస్తున్నట్టు ఎలాంటి జాడలు కనిపించటంలేదు. ఒక్కవేళ సెలవు పెట్టాడేమో?.... ఎన్నాళ్ళు?? పెళ్ళి కాకముందు హైదరాబాదులో ఉద్యోగమని చెప్పారు. అక్కడినుంచి పెళ్ళికి సెలవుతోబాటు సొంత ఊళ్ళోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకొచ్చినట్లు చెప్పారు. కాని భర్త వాలకం చూస్తుంటే ఆఫీసు కెళుతున్న సూచనలేవీ కనిపించటంలేదు. పగలు యింట్లోనివాళ్ళకి, రాత్రి భర్తకు కావలసినవి అందించే యంత్రమైంది తను

పనుంటే తప్ప తనని పిలవరు. కనీసం తిండి తిన్నది. లేనిది కూడా కనుక్కోరు. తన మంచీ చెడులు విచారించరు. అత్తమామలు ఆప్యాయంగా పలకరించరు. కట్టుకున్నవాడికి రాత్రిపూట తప్ప తను గుర్తుకు రాదు ఇంటెడు చాకిరీ.... రెండు పూటలా అంత తిండి తనని దాసీదానిలా భావిస్తున్నారేమో....

"మీరు ఆఫీసుకు వెళ్ళటం లేదేం?" భోజనం వడ్డిస్తూ ధైర్యంచేసి భర్తని ఒక రోజు అడిగింది శారద.

"ఏం.... నీ ఎదురుగా వుండటం ఇష్టం లేదా?" మొదట కంగారుపడినా, తరువాత సర్దుకొని అన్నాడు.

శారద అయోమయంగా చూసింది ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. మౌనంగా వుండిపోయింది.

"సారీ జానీ.... మన పెళ్ళికి సెలవు పెట్టాను" అన్నాడు నవ్వటానికి ప్రయత్నిస్తూ....

"ఎన్ని రోజులు".... అని శారద అడగలేదు. అడిగినందువల్ల ప్రయోజనం లేదని ఆమెకు తెలుసు. వాళ్ళంతా అదో లాంటి మనుషులు. వాళ్ళవి వింత మనస్తత్వాలు

తన తండ్రిదగ్గర తీసుకున్న కట్నంలో కొంత బాకీకింద చెల్లువేసి ఇంటిని తనఖా నుంచి విడిపించాడు మామయ్య.... మిగిలిన డబ్బు పేకాటలో తగలేశాడు. ఆరోజు అర్థరాత్రి అత్తమామలుపోట్లాడుకోవడం. వాదులాడుకోవటాలతో ఈ విషయం స్పష్టంగా అర్థమైంది శారదకి. ఎందుకో ఆమె మనసు బేజారైంది. రాజులసొమ్ము రాళ్ళపాలన్నట్టు ఆడపిల్లల తండ్రుల సొమ్ము వియ్యంకుల వ్యసనాలపాలా? కట్నంపేరుతో అల్లుళ్ళపాలా?

* * *

ఆరోజు ఇంటిలో ఎవరూ లేరు.... కామాక్షమ్మ, వసుంధర మ్యాట్నీకి వెళ్ళారు. నాగరాజు ఉదయం వెళ్ళాడు. భోజనానిక్కూడా రాలేదు. రామారావు క్లబ్బుకి వెళ్ళాడు. శేఖర్ కాలేజీకి వెళ్ళాడు.

శారద పెరటిలోని బావి చప్టామీద బట్టలుతుకుతోంది. పక్కింటి కాంతమ్మ వచ్చింది

"రా పిన్నీ ....కూర్చో" శారద ఆహ్వానించింది.

"నిశ్శబ్దంగా వుంది. ఇంట్లో ఎవరూ లేరా?" లేరని కాంతమ్మకు తెలుసు. ఆ విషయం రూఢి చేసుకునే లోపలికి వచ్చింది.

"లేరు పిన్నీ ..." శారద.

కాంతమ్మ పురాణం విప్పింది. ఎన్నెన్నో సంగతులు చెప్పింది. ఒక్కొక్క మాట శారద నెత్తిమీద ఆటం బాంబు పడినంత బాధ పెడుతున్నాయి. శారద కొయ్యబారిపోయింది.... ఆమెలో చలనం స్తంభించిపోయింది.

నాగరాజుకు అన్ని దురలవాట్లు వున్నాయి.... తాగుతాడు ... జూదమాడతాడు. రోజూ డబ్బు కావాలని ఇంట్లో అల్లరి పెడుతుంటే- అతని ఆగడికి తట్టుకోలేక రామారావు కొడుకుని హైదరాబాదులో వున్న పెద్దల్లుడి దగ్గరకు పంపించాడు పెద్ద కూతురు వేళకి అంత తిండి పెడుతుంటే, సినిమాలకి, సిగరెట్లకి ఇంటి దగ్గర్నుంచి పాతికో, పదో నెల నెలా రామారావు పంపేవాడు. అప్పటికే నాగరాజు ఘనకార్యాలు తెలిసిన కొందరు సంబంధాల కొచ్చి, వెనక్కి వెళ్ళిపోయారు. నాగరాజుకు పెళ్ళవుతుందనే నమ్మకం చచ్చిన తలిదండ్రులు కొత్తనాటకం ఆడారు. నాగరాజు హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నట్లు ప్రచారం సాగించారు. ఉద్యోగం ఎరవేస్తే యెవరో ఒక్క ఆడపిల్లి తండ్రైనా పడకపోతాడా అని వాళ్ళ ఆశ.

దేశంలో యెందరో ఆడపిల్లల తండ్రులు ఉన్నప్పుడు, ఎందరికో కన్న కూతుళ్ళ పెళ్ళిళ్ళు గుదిబండలై కూర్చున్నప్పుడు, కట్నాల దావాగ్నిలో యెందరో సమిధలై మాడిపోతున్నప్పుడు ఎవరైనా ఆ వుచ్చులో పడకుండా యెలా వుంటారు? అలా పడినవాడు ప్రకాశం.

ఎదుగుతున్న కూతుళ్ళను చూసి గుండెలు గుభేలుమనే తల్లిదండ్రులు ఎక్కువయ్యారు ఆడపిల్లల్ని కన్నవాళ్ళ కంగారును సొమ్ము చేసుకోవటానికి తయారవుతున్న వాళ్ళు కూడా ఎక్కువౌతున్నారు.

స్త్రీ జీవితం పెద్ద లాటరీ అయింది. ఆమెను పెళ్ళాడేవాడు కట్నం లాటరీ కొడితే మధ్యవర్తులు లాటరీ కమీషన్ సంపాదిస్తున్నారు.

పుస్తకలో తేవాలేము. జీవన సరళిలో వైవిధ్యంలేదు. సామాజిక బాధ్యతలో మినహాయింపు లేదు. శరీరంలో ప్రవహిస్తున్న రక్త మాంసాల్లో తారతమ్యం లేదు. మేధస్సులో అల్పత్వంలేదు కాని—

బ్రతుకులో ఎందుకింత దుర్బలత్వం?

కష్టాల్లో, సుఖాల్లో భాగం పంచుకొని, ఎవ్వరూ అందించలేని సుఖాన్ని తనకు అందిస్తూ, తన వంశాన్నినిలబెట్టే ఓ స్త్రీని జీవితాంతం భరించటానికి - ఆమె నుంచి సొమ్ము తీసుకునే మగవాడిలో పురుషసిలో వుండాల్సిన పౌరుషం, ప్రయోజకత్వం ఎక్కడ వున్నట్టు? ఆమె సొమ్ముతోనే ఆమెను పోషించే దౌర్భాగ్యపు 'లో బన ఈ మగాడి కెందుకు? ఆడదాన్ని వంచించి డబ్బు గుంజటానికి ఇన్నిపాట్లా? ఇన్ని మాయాజాలాలా? ఇన్ని దొంగ నాటకాలా?

శారద ఆలోచనల నుంచి తేరుకొనే సరికి సూర్యుడు పడమటి పొదరింటిలో దూరటానికి తొందరపడుతున్నాడు. శారద మనసు మనసులో లేదు.... ముళ్ళకంపలా చింపరవందరైంది. కకావికలైంది తుక్కులా చించిన విస్తరిలా.... మొఖం తేపురించింది....కాంతమ్మ ఎప్పుడో వెళ్ళిపోయింది.

కాంతమ్మ చెప్పినవన్నీ నిజమైతే....! తన జీవితం బండలైనట్టే....తన బ్రతుకు బూడిదైనట్టే.... తను జీవచ్ఛవమైనట్టే!

ముందు జరగబోయేది తల్చుకుంటే శారదకి కంపరం పుడుతోంది పెనుగాలికి విలవిల్లాడే చిగురాకులా వణికిపోతోంది..

నాగరాజు వచ్చాడు "హా నీ! మై డార్లింగ్. పెరట్లో ఏం చేస్తున్నావ్?" నవ్వాడు. అదే వాసన, కళ్ళ వాసన....

"ఎందుకు నన్నింత మోసం చేశారు" తీక్షణంగా అడిగింది శారద.


అదిరిపోయాడు నాగరాజు. "మోసమేమిటి?"

"మీకు ఉద్యోగం లేదు. కానీ,కట్నం కోసం అబద్ధం చెప్పారు"

"నిజమే! అందుకని నేను నీ మొగుణ్ణి కానా? నాతో కాపరం చెయ్యవా?"

శారదకి ఒంటినిండా ఉక్రోషం. మోసపోయానన్న రోషం, బాధ "అసలు మీరు మనుషులు కారు అబద్ధాలతో నా గొంతు కోశారు" పెద్దగానే అన్నది శారద. ఇంకా ఏవేవో అడగాలన్నంత కసి యేర్పడింది ఆమె మనసులో.

కాని మొదటి మాటకే నాగరాజు ఆమె జుట్టు పడిసిపట్టుకుని వీపుమీద దబీమని బాదాడు. అనుకోని ఆ దెబ్బకు శారద




దిక్కు చచ్చిపోయింది. ఆ చెంపా, ఈ చెంపా వాయించాడు. మళ్ళీ చెయ్యెత్తాడు.

కాలేజీనుంచి యెప్పుడొచ్చాడో శేఖర్. నాగరాజు చెయ్యి పట్టుకుని వెనక్కి గుంజాడు. నాగరాజు పెనగులాడినా వదిలిపెట్టలేదు.

ఈ హడావిడిలోనే కామాక్షమ్మ, వసుంధర వచ్చారు నాగరాజు తల్లికి యేవేవో చెప్పాడు కామాక్షమ్మ అందుకొంది. "ఏమే....మగాణ్ణి పట్టుకొని అంతంత మాట లడుగుతావా, అవునే... వాడికి ఉద్యోగం లేదు. అందుకని వదిలేసి పోతావా ... పో....ఓ యబ్బో....నీ యబ్బే ఇచ్చాడులే— ముష్టి ఆరువేలు.... ఇక ముందు పిచ్చిపిచ్చి వేషాలేశావో.... మెడ పట్టుకొని గెంటాల్సొస్తుంది" కామాక్షమ్మ విసవిసా లోపలికెళ్ళింది.

"అవును. నా తండ్రి ఇచ్చింది ముష్టి ఆరువేలే.... కాని వాటికోసం ఆయన మానమర్యాదల్ని తాకట్టుపెట్టిన సంగతి మీకేం తెల్సు.... అపాత్రదానంలా మీకు నన్నిచ్చి పెళ్ళిచేసి ఆయన తననితానే మోసం చేసుకున్నాడు.... నాన్నా! నీ కూతురు ఎంత బాగా సుఖపడుతోందో చూడు నాన్నా! చూడు....'

* * *

"ఏం.... ఏడుస్తూ ఇక్కడే పడుంటావా?" నాగరాజు గర్జించాడు.

"నాకు ఒంట్లో బాగా లేదు"- శారద.

కామాక్షమ్మ అందుకొంది, "ఏమిటమ్మాయ్ నీ మొండితనం.... వాడు నిన్ను పెళ్ళిచేసికొన్నది ఎందుకు? వెళ్ళు గదిలోకి."

"వీళ్ళకి సిగ్గులేదు"— అనుకొంది. 'మీ జీవానపడి ఏడవటానికి నన్ను చేసుకున్నాడు' అని పెద్దగా అరవాలనుకొంది.

"రేయ్ దాన్ని బ్రతిమాలితేమాటినదు, బరబరా లాక్కుపో!"

మానవత్వాన్ని పశుత్వం జయించింది. ఆడదానికి వయసేకాని మనసనేది ఉంటుందని పొరబాటునకూడా భావించని నాగరాజు లాంటి శాడిస్టులకి కావలసింది ఎదుటి మనిషిని హింసించి ఆనందించటమే.

ఇప్పుడు శారదని చూస్తుంటే వాళ్ళకి అసహనంగా వుంది. ఆమె చూపులు వాళ్ళలో కంగారు పుట్టిస్తున్నాయి. తమ తప్పును దాచుకోవటానికి తరచు కామాక్షమ్మ నోరు చేసుకొంటోంది. నాగరాజు చెయ్యి చేసుకొంటున్నాడు. తులసివనం నుంచి గంజాయి తోటలో పడినట్టుంది శారదకి.

"చూడమ్మాయ్- వాడు పనీపాటా లేకుండా తిరుగుతున్నాడు ఏ సంపాదనా లేకుండా ఇంకరు ఏం తిని బతకాలి? ఇది వరకటి దాకివేరు. ఇప్పుడు మనుషులు పెరిగారు. మీకు పిల్లా పీచు పుడితే కుటుంబం మరీ ఇబ్బందుల్లో పడిపోతుంది. వాడు ఏదో వ్యాపారం చేస్తానంటున్నాడు. మీ నాన్నని నాలుగువేలు సర్దమను" తాపీగా అన్నది కామాక్షమ్మ. అని కోడలి ముఖంలోకి సూటిగాచూసింది.

శారద గుండెలో పిడుగు పడింది. "అంత డబ్బు ఆయన ఎక్కడినుంచి తెస్తాడు? ఆయన పరిస్థితి తెలిసి కూడా ఎలా అడగను?"

"కూతురి సంసారం కోసం ఆ మాత్రం చెయ్యలేడా? పోనీ అప్పుగా ఇవ్వమను. తరువాత తీర్చేద్దాం" నాగరాజు.

"ఆయనకు అప్పెవరిస్తారు?" శారద.

"అదంతా నాకనవసరం నువ్వు డబ్బు

తేవాలి. అంతే" నాగరాజు.

"మీరు ఏం చెయ్యమన్నా చేస్తాను. ఇదిమాత్రం నావల్లకాదు"

నాగరాజు ఉగ్రుడయ్యాడు అతనిలో మనిషి చచ్చి రాక్షసుడు ప్రవేశించాడు. కసి తీరేంతవరకు బాది వదిలాడు. శారద దేహం పచ్చి పుండయింది. పెదాలు చీరి ధారగా రక్తం కారింది. తరతరాల బానిసత్వంలో స్త్రీకి లభిస్తున్న అమూల్య కానుక రుధిరాభిషేకం.

* * *

శారద చాపమీదనుంచి లేచింది. హడావిడిగా ముఖం కడిగింది బట్టలు సర్దుకొని వున్న బ్యాగు తీసుకొని స్టేషన్‌కు బయల్దేరింది. పెళ్ళయి నెల తిరక్కముందే పసుపు పారాణి ఆరకముందే ఓ స్త్రీని రోడ్డున పడేసిన ఈ వ్యవస్థ అప్పటికీ యింకా చీకటి మత్తులో మునిగేవుంది.

'తన జీవితం యెందుకిలా అయింది? తను చేసిన పాపమేమిటి? కేవలం ఆడదిగా పుట్టటమేనా తనపాపం.... ఒక పేదవాడి కడుపున పుట్టటమా తన పాపం. మానవత్వం లేని రాకాసుల మధ్య ఎంతకాలం తను బ్రతకగలుగుతుంది?'

కట్నం తేలేదని. తెచ్చింది చాల్లేదని కోడళ్ళను సాధించి. చివరికి హత్యలు కూడా చేసిన అత్తమామలు. భర్తలు ఆమె కళ్ళముందు నిలబడి భయపెడుతున్నట్లని పిస్తోంది.... 'పశుత్వం నిండిన ఆ మనుషులు ఏమైనాచెయ్యగలరు....' ఆ ఇంటిని, అత్తమామల్ని భర్తని తల్చుకొంటేనే శారదకి ఒంట్లో రక్తం గడ్డకడుతోంది. 'సంసారం ఇంత భయంకరమైనదా? స్త్రీ జీవితం ఇంత ప్రమాదభరితమైనదా?'

రిక్షా దిగి వాకిట్లోకి వెళ్ళగానే నవ్వుతూ ఆహ్వానించాడు ప్రకాశం కూతుర్ని.... రాధమ్మ అప్పటికప్పుడే స్నానానికి నీళ్ళు తోడింది. స్నానాల గదిలో శారద ఒళ్ళు చూసి రాధమ్మ గుండెనీరైంది. శరీరం నిండా గాయాలు.... పచ్చివీ, మానుతున్నవి... మానినవి.... ఆమె చిత్రహింసల పాలైనట్టు స్పష్టంగా తెలిసిపోతోంది. జరిగినదేమిటో చెప్పమని పట్టుబట్టాడు ప్రకాశం.... శారద ఏమీ దాచుకోకుండా చెప్పేసింది. ప్రకాశం విమూఢుడయ్యాడు.... పరిస్థితి బాగా చెడిపోయిందని అర్థమైంది.

"నాన్నా! వాళ్ళు నన్ను చంపేస్తారేమోనని భయంగా ఉంది" అని అమాయకంగా, దిగులుగా అంటున్న శారద మాటలు ఆ కన్నవాళ్ళ గుండెలు పిండేశాయి. రాధమ్మ కూతురు కాపురం పాడైనందుకు అనుక్షణం కుములుతూనే ఉంది.

వారం రోజులు గడిచినై, రామారావు, కామాక్షమ్మ, నాగరాజు వచ్చారు. "బావగారూ! శారదని తీసుకుపోవటానికొచ్చాం" అన్నాడు రామారావు.

ప్రకాశం కడుపులో సాగరాలు పొంగుతున్నాయి. తమాయించుకొని అన్నాడు: "అది మనిషనుకున్నారా? గొడ్డనుకున్నారా? డబ్బు కోసం మోసంచేసి పెళ్ళి చేసుకొని దాని గొంతు కోసింది చాలక చిత్రహింస చేస్తారా?"

కామాక్షమ్మ అందుకొంది- "అదేమిటన్నయ్యా! ఏదో కుర్రతనం. కొట్టుకోకుండా, తిట్టుకోకుండా వుంటారా? వాడిప్పుడు ఎంత బాధపడుతున్నాడో తెలుసా? వాడి బాధ చూడలేకనే వున్నపళంగా వచ్చాము"

ఈపాటికే ఇరుగమ్మ, పొరుగమ్మ మూగారు. భర్త కొట్టినా, చంపినా అక్కడే పడుండా లన్నారు. మగవాడి తోడు లేని ఆడది బ్రతకలేదన్నారు భర్తను విడిచిన ఆడదానికి సంఘంలో గౌరవం లేదన్నారు. తరతరాల బానిసత్వం, అజ్ఞానం, మూఢవిశ్వాసం వాళ్ళచేత అంతకంటే గొప్పగా పలికించలేవు.

శారద సమాధానం చెప్పలేదు. ఆమె గుండె వేగంగా కొట్టుకొంటోంది.

విసిగిపోయిన కామాక్షమ్మ కోపంతో అంది: "వాడికేం మగాడు. చెడిపోయేది మీ అమ్మాయే. కావాలనుకొంటే నెల తిరక్కుండానే వాడికి పెళ్ళి చేసెయ్యగలను. పుల్లిస్తరాకులా పనికి రాకుండా పోయేది మీ అమ్మాయే."

"ఇప్పుడు దాన్నేదో మీరు సుఖపెట్టినట్టు" కటువుగా అన్నాడు ప్రకాశం. ఆయన హృదయంలో పగిలే అగ్నిపర్వతాలలాంటివి

నాగరాజులో పురుషాహంకారం బుసకొట్టింది. "నేను అక్కరలేకపోతే నేను కట్టిన తాళిమాత్రం ఆ మెడలో యెందుకు? అది తెంచి పారేస్తే మా దారిన మేం పోతాం" అని గర్వంగా అందరి ముఖాల్లోకి చూశాడు.

ఒక్కసారిగా ఇల్లంతా నిశ్శబ్దం.... యుగయుగాలుగా తాళిని లైసెన్సు బిళ్ళలా కట్టి స్త్రీని ఆస్తిలా వాడుకొంటున్న మగవాడికి దాని మీద అంత నమ్మకం!

శారద ఒక్క క్షణం ఆలోచించింది... తను ఇప్పుడు కొండ శిఖరం మీద వుంది. దిగి పాతదారినే నడవాలో, కొత్త దారి ఎంచుకోవాలో ఆలోచించింది.. 'పెళ్ళి పేరుతో బానిసగా తను బ్రతకలేదు. కట్నం కోసం ఇంత నీచానికి దిగిన ఈ మనుషులు ఏనాటికైనా తనని సంతోషంగా వుండనియ్యరు. తను చేసే పని లోకం హర్షించకపోవచ్చు.. అందుకోసం ఆత్మహత్య చేసుకోదు తను. తను బ్రతుకుతుంది. ఈ లోకానికి. ఈ సమాజానికి ఎదురీది బ్రతుకుతుంది....'

ఒక్కసారిగా శారద మెడలోని తాళి తెంచి నాగరాజు ముఖం మీదికి గిరాటేసింది.

నిజానికి ఆమె తెంచింది తాళిబొట్టును కాదు. దాని నడ్డంపెట్టుకొని ఆడదాన్ని తన స్వార్థానికి బానిసగా వాడుకొంటున్న పురుషాహంకారాన్ని. ఆమె తెగతెంపులు పెళ్ళితో కాదు.... పెళ్ళి పేరుతో మోసంచేసి ఆడపిల్లల్ని అడ్డం పెట్టుకొని డబ్బుకోసం కొందరు సాగిస్తున్న అతి నీచమైన వ్యాపార సంప్రదాయంతో.... ఆమె తిరుగుబాటు! వరకట్న సమస్య స్త్రీకి బిగిస్తున్న ఉరితాడుమీద

కట్నాల మారణహోమంలో రగులుతున్న ఎందరో.... ఎందరెందరో శారదల కథలు వెలుగులోకి చేరవు.... వాటికి ఆరంభమే కాని అంతం లేదు.

## వీధి దీపం

నిన్న
నా వెల్గులో చదివి డిగ్రీలు పొందిన
విద్యావంతుడు

నేడు
ఉద్యోగం కోసం నన్ను పగులగొట్టిన
ఉద్యమకారుడు.

—రామకృష్ణచంద్రమౌళి

## అంకితం

ఒకరు నా జీవితానికి, ఆలోచనలకు స్ఫూర్తి. మరొకరు నా హృదయంలో చెరగని మూర్తి. అందుకే ఈ కథ

నా కోటేశ్వరికి—నా ప్రభకు
అంకితం.

— పి. నాగేశ్వరరావు